# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 03 జూలై 2023


## గరుడ వాహనంపై సౌమ్యనాథస్వామి



నందలూరు, జులై 2 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని శ్రీసౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుచ్చి ఆదివారం ఉదయం స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి తిరుమాడ వీధుల్లో తిరుగుతున్న భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. స్వామి వాహనం వెంట కోలాటాలు, చెక్కభజనలు, కీర్తనలు చేస్తూ భక్తుల సందడితో మాడవీధుల్లో సాగింది. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవింద గోవిందా నామాలు పాడుకొంటూ ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో నందలూరు ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, టిటిడి డిప్యూటి ఇఒ నరేష్‌బాబు, ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్, అర్చకులు సునీల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో క్రీడాకారులకు బహుమతులు ప్రదానం



కడప కార్పొరేషన్, జులై 2, ప్రభాతవార్త:

కడప నగరంలోని ఉర్దూ బాయ్స్ హైస్కూలు నందు తైక్వాండో విద్యార్థినీ విద్యార్థులకు వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అఫ్జల్‌ఖాన్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండోలో విజయం సాధించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ, ఎంఎం హాస్పిటల్ అధినేత ఆవిద్, పీఏటీ సాజిత్, తైక్వాండో మాస్టర్ జంషీర్ తదితరులు పాల్గొన్నారు.

# మామిడెంత మధురం...

పెరిగిన దిగుబడులు - తగ్గిన ధరలు ... మామిడి రైతులకు ప్రోత్సాహకం కరువు ... కనుమరుగవుతున్న మల్‌గూభ రకం





రామసముద్రం, జూన్ 30 ప్రభాతవార్త :

పండ్లల్లో రారాజు మామిడిపండు...మామిడిపండు అమృతంతో సమానం అంటారు. అరుచి ఆమోఘం..అద్భుతం, అనిర్వచనీయం. పసుపుపచ్చని రంగులో నిగనిగలాడే మామిడి ఫలాలనుచూస్తే ఆరేళ్ళ చిన్నారి నుంచి అరవైఏళ్ల ముదుసలి వరకు మామిడిపండును చూస్తే లొట్టలేస్తారనడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. మామిడిపండు రుచి చూడకపోయినా, మామిడిపచ్చడి తినకపోయినా ఆ జీవితం వృధా అనే నానుడి సైతం ప్రచారంలో ఉందంటే మామిడి ప్రాముఖ్యత ఏ పాటిదో ఇట్టే అర్థమౌతుంది. మామిడిపళ్ళ సీజన్‌లో మామిడి ఫలాలను ఆరగించని వారుండరంటే బహుశా అతిశయోక్తికాదేమో. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మామిడి ఫలాలకు దేశంలోనే మన రాష్ట్రం ప్రసిద్ధి. అందులోనూ చిత్తూరుజిల్లా, అన్నమయ్య జిల్లాలోని తూర్పు ప్రాంతంలో అధికంగా లభించే బేనీషా, ఎర్రనీలం, మల్‌గూబ, చక్కెరగుత్తి వంటి మామిడి ఫలాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. దేశ, విదేశ ప్రముఖులు మనస్సును సైతం మన మామిడి దోచేసింది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన మధురఫలాలు నేడు తమ సహజత్వాన్ని కోల్పోయి నాణ్యత లేమిగా, అధిక ధరలతో సామాన్య, మద్యతరగతి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మధుర ఫలా లైన మామిడిని విషతుల్యంగా మారుస్తున్నారు. అత్యధికంగా రసాయన విని యోగాలతో పంట పండించడం సహజంగా మాగాల్సిన మామిడిపండ్లను విష తుల్యమైన కార్బైడ్ ద్వారా మాగిస్తూ వినియోగదారుల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారు. ఇంకా పలురకాలైన రెడ్డిపసంద్, దిల్‌పసంద్, బెంగుళూర తదితర రకాలు పూర్తిగా నాణ్యతలేమిగా దొరుకుతున్నా యని వినియోగదారులు వాపోతున్నారు. అంత జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తుండడం గమనార్హం. ఈ ఏడాది మామిడి దిగుబడి పెరి గింది. ధరలు తగ్గాయి. మార్కెట్‌లో ధరలు తగ్గినా చిరువ్యాపారులు మాత్రం రేట్లు పెంచేశారు. మే, జూన్,జూలైల్లో మాత్రమే లభించే మామిడిపండ్లు ఎంతో మదురం. ప్రభుత్వాలు ఇప్పటికైనా ఎంతో ప్రాధాన్యత కలిగిన మధురఫలాలను కనుమరుగు కాకుండా చూసి మామిడి రైతులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

వేంపల్లె, జూలై 2, ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేంపల్లె మండల పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టరు విజయరామరాజు సూచించారు. ఆదివారం ఇడుపులపాయ ఎస్టేట్‌లోని నెమళ్లపార్కు, వైఎస్ఆర్ ఘాట్, ఆర్‌కె వ్యాలీ నూతన పోలీసు స్టేషన్‌తో పాటు పలు ప్రాంతాలను జేసీ గణేష్‌కుమార్, కడప నగర కమీషనరు ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టరు రాహుల్‌మీనా, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నెమళ్లపార్కు లో ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు, నూతనంగా నిర్మించిన ఆర్‌కెవ్యాలీ పోలీసుస్టేషన్ భవనం, వైఎస్ఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ప్రార్థనల్లో పాల్గొనే ఏర్పాట్లను కలెక్టరు పరిశీలించారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేంపల్లె తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అ అధికారి వద్ద పనిచేయలేకున్నాం

### కోడూరు పంచాయతి సిబ్బంది ఆవేదన

### పట్టించుకోవాలని డిపిఒకు వినతి

రైల్వేకోడూరు, జులై 2 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని గ్రామ పంచాయతి పరిధిలో పని చేస్తున్న ఒక అధికారి డబ్బులు వసూలు చేసి తనకు ఇవ్వకుంటే విధులు చేయాల్సిన అవసరమే లేదని అనడంతో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ముద్దలూరు సుధీర్‌కుమార్ రాజు, హర్షవీణ అనే జూనియర్ అసిస్టెంట్‌లు సెలవుపై వెళ్లిపోయినట్లు కోడూరు గ్రామ పంచాయతి సిబ్బంది పలురకాల వాదనలు వినిపిస్తున్నారు. ముఖ్యంగా రైల్వేకోడూరులోని కొత్తకోడూరులో తహశిల్దారు కొంతమందికి ఎన్ఒసిలు ఇవ్వకుండా అప్పుడు సంబంధించిన బాధితులకు సంబం ధిత పత్రాలు ఇవ్వవద్దని తహశిల్దారు ఆదేశాలు జారీ చేసినా ఒక్కొక్క నివాసానికి 15 వేల రూపాయలు నగదు తీసుకుని అధికారపార్టీ, ప్రతిపక్ష పార్టీవారితో కుమ్మక్కై ఎమ్మెల్యే ఆదేశాలను పక్కనబెట్టి పలురకాల అవినీతి పనులకు సంబంధిత ఉన్నతస్థాయి అధికారి అవినీతికి పాల్పడడం అత్యంత బాధాకరమైన విషయమని, బిల్‌కలెక్టర్‌లు తాను చెప్పిందే వేదంగా పనిచేసి ఆయనకు ఆదాయం ఇవ్వ కుంటే వారి అంతు తేలుస్తానని సంబంధిత కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో వారు కూడా సోమవారం నుండి లీవులో వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని, దీనిపై అన్నమయ్య జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతి అధికారి విచారణ చేపడితేనే ఈ అధికారి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని బాధితులు చెప్పలేక కొంతమంది ద్వారా విలేకరులకు సమాచారం ఇచ్చారు. ఏది ఏమైనప్ప టికి రైల్వేకోడూరు గ్రామ పంచాయతి కేవలం అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఐదుగురితో అవినీతి కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి రైల్వేకోడూరు చేసిన ఒక సీనియర్ వైసిపి నాయకులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫోన్‌కాల్ ద్వారా తెలియజేశారు. ఏది ఏమైనప్పటికి రైల్వేకోడూరులోని గ్రామ పంచాయతి కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమందిని విచారించి బాధితులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# కాలువగా మారిన ప్రధాన రహదారి



### ఉన్న కాలువలు పూడ్చి నిర్మాణాన్ని చేపట్టారు

### బస్టాండు కూడలిలో కాలువ దారి లేక నిలిచిన వరదనీరు

నందలూరు, జులై 2 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని బస్టాండు కూడలిలో చిన్న వర్షం పడితే చాలు మోకాటి లోతు నీరు నిలబడి ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో ఉన్న కాలువలు పూర్తిగా పూడ్చి నిర్మాణాలు చేపట్టారు. వరదనీరు వెళ్లేందుకు దారిలేక కూడలిలో నిలిచి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. నాయకులు కాని, అధికారులు కాని దీనిపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించేదిశగా అడుగులు వేయకపోవడం దురదృష్టకరం. పాదచారులు కూడలిలో రోడ్డు దాటాలంటే పడే అవస్థలు వర్ణాతీతం. కాలువలపై నిర్మాణాలు చేయకూడదని నాయకులు జిల్లా అధికారులకు అర్జీలు ఇస్తారు. వారే నిర్మాణాలకు అనుమతులు ఇప్పిస్తారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు మండలం అతలాకుతలమైంది. వరదనీరు వెళ్లేందుకు ప్రధాన కాలువపై ఉన్న నిర్మాణాలను తొలగించి ప్రజలకు, మండలానికి ముందు వచ్చే ముప్పును అంచనా వేసి చర్యలను ముమ్మరం చేయాలని స్థానికులు అంటున్నారు. కాలువపై కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపట్టి వాటిని అద్దెకు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారు. వారిని పంచాయతి అధికారులు కాని, నాయకులు కాని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అక్రమ నిర్మాణాలపై ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

### పంటలుసాగుచేయకున్నా

# పట్టాభూమి ఉంటే బీమా సొమ్ము ఖాయం

పంటలు సాగుచేసేది కౌలురైతు, భీమా పట్టారైతు ఖాతాల్లోకి






రాజుపాళెం, జూలై 2, ప్రభాతవార్త.

మండల పరిధిలోని చాలా గ్రామలలో పట్టాభూమి ఉన్నా వ్యవసాయం చేయలేని రైతుల భూములు భూమిలేని రైతులు వారి భూములు కౌలుకు(గుత్తకు) తీసుకొని వ్యవసాయం చేసి పంటలు సాగు చేసి ప్రకృతి వైపరిత్యాలకు నష్టాలు కష్టాలు ఎదుర్కొంటున్నారు పంటల బీమా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం భీమా మంజూరు చేసినది ఈఏడాది,అయితే పంటలు నష్టపోయిన కౌలురైతులకు భీమా చాలా మందికి ఆమడదూరంలో ఉన్నది, అదే బీమా పంటనుసాగుచేయని పట్టారైతుకు దరిచేరి వారిఖాతాలలోకి జమ అవు తున్నది అంటే కౌలుతో పాటు బీమా భోనస్ అన్నట్లు డబుల్ ధమాకా గా మారింది పంటలు వేయకున్నా భూమి వారిపేరున ఉన్నందున వారికే భీమా దక్కు తున్నందున వారు ఖుషీగా ఉన్నారు, పంట నష్టపోయిన కౌలురైతులు చేసేది ఏమిలేక నిరాశగా ఉన్నారు. సొంత భూమి ఉండి పంటలు సాగుచేసిన రైతులకు న్యాయం జరుగుతుంటే, కౌలుకు తీసుకొని సాగు చేసిన రైతులకు అన్యాయం జరుగుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమి ఎరగనట్లు ఏదిపట్టనట్లు ఉన్నారు. పట్టా రైతులు కౌలుకు ఇచ్చి పంటలు సాగు చేసుకోమంటారు. కౌలు పత్రంనకు అంగీకారం తెలుపు పత్రం ఇవ్వరు. అదిలేకుంటే మేము పంట సాగు చేసిన రైతుపేరు నమోదు చేయలేమంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఇది బాగున్నది. పంటను కౌలుభూమిలో ఎవరు సాగుచేసినది పంట నమోదు సాగు చేయని రైతుపేరును ఏలా నమోదు చేసి వారి బ్యాంకు ఖాతా నంబరును సిపార్సు చేస్తారని కౌలు రైతులు విమర్శించుతున్నారు. పంటనమోదు సమయం లో ఫొటం గట్టు తొక్కి రైతును నిలబెట్టి పంట ఫోటో తీయాలి, భూమి, రైతు వివరాలుతెలుపు పత్రాలు నకలు సమర్పించాల్సి ఉంటుంటుంది అప్పుడు సాగు చేయని రైతువచ్చి సాగు చేశానని చెప్పితే సంబంధిత అధికారులు ఎలా నమ్మ తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈఏడాది 7983 ఎకరాలలో సాగుచేసిన ప్రతి పంటగాను 3221 మంది రైతులకు ఎకరాకు రూ.12,500లు చొప్పున 9కోట్ల 93లక్షలు83 వేలు మండలానికి మంజూరు అయినది. అందరు రైతులు ఆనందంగా ఉన్నా కౌలు రైతులు చాలా మంది నిరాశగా ఉన్నారు. సాగుచేసిన రైతు కు నష్టపరిహారం కానీ, భీమా కానీ దక్కేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసకోవాలని కోరుతున్నారు.

# సేంద్రీయ ఎరువులతో పండిస్తున్న విదేశీ డ్రాగన్ ఫ్రూట్స్

### తల్లిదండ్రుల కల నెరవేర్చడమే లక్ష్యం : రైతు రామకష్ణారెడ్డి





పీలేరు, జూలై 02 ప్రభాతవార్తః

తల్లిదండ్రుల కళలను నెరవేర్చడమే తన లక్ష్యంగా రైతు చింతపర్తి రామకష్ణారెడ్డి హైదరాబాదులో కంప్యూటర్స్ బిజినెస్ లో ఉంటూనే సీవీరెడ్డిస్ ఆగ్రో ఫామ్ ను కలికిరి మండలం మర్రికుంటపల్లె పంచాయతీ మల్లిరెడ్డిగారిపల్లె వద్ద 2021 డిసెంబరు లో 20 ఎకరాల విస్తీర్ణంలో పంట ప్రారంభించి మంచి సక్సెస్ ఫుల్ రైతుగా ముందుకు సాగుతున్నారు. ఈవ్యవసాయ క్షేత్రంలో మొదట వంద బార్హి విదేశీ ఖర్జూరపు మొక్కలను నాటినట్లు తెలిపారు. అయితే ఇది నాలు గేళ్ల పంట కావడంతో ఈమద్యలో 6 ఎకరాల్లో 3 రకాల విదేశీ డ్రాగన్ ఫ్రూట్స్ మొక్క లను నాటారు. వీటిలో 2వేల మొక్కలు అమెరికన్ బ్యూటీ , 3వేల మొక్కలు థైవాన్ జంభో, 7వేల మొరాక్కన్ రెడ్ డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను నాటారు. 300 కాశ్మీర్ ఆపిల్ బేర్ మొక్కలు, 300 మేహోగని మొక్కలు వంద కొబ్బరి మొక్కలు నాటారు. ఇదిలా ఉండగా ఈపండ్ల మొక్కల పెంపకం పూర్తిగా సేంద్రీయ ఎరువు లతో సీవీఆర్ వ్యవసాయ క్షేత్రంలో పండిసు న్నారు. ఈ క్షేత్రంలో పండిస్తున్న పండ్ల తోటల్లో మొరాకన్ రెడ్ డ్రాగన్ ఫ్రూట్స్ మొదటి పంట దాదాపు 600 కిలోలు రావడంతో రైతు చింతపర్తి రామకష్ణారెడ్డి తమ రెడ్డి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షులు వై.ఆదినారాయణ ఆధ్వర్యంలో తన తండ్రి సీవీరెడ్డి జ్ఞాపకార్థం ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా రైతు రామకష్ణారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి చింతపర్తి వెంకటరెడ్డి రైతు కుటుం బంలో జన్మించి ఆరుగాలం కష్టపడి పంటలు పండించారని అన్నారు. అయితే ఎప్పుడూ లాభాపేక్ష చూడలేదన్నారు. తమకు కూడా రైతుగా పలువురికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారన్నారు. తన తండ్రి కోరిక మేర కు ఈవ్యవసాయ క్షేత్రాన్ని రూ.1.5కోట్లు వెచ్చించి ప్రారంభించి నూతన పండ్ల తోటలను ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. తన సీవీ రెడ్డిస్ ఆగ్రోఫామ్ అభివద్ధికి తన తమ్ముడు వేణుగోపాల్‌రెడ్డి సహకరిస్తున్నట్లు తెలిపారు. మరో వారం పది రోజుల్లో రెండవ పంట చేతికి రానున్నట్లు తెలిపారు. తమ క్షేత్రంలోని డ్రాగన్ ఫ్రూట్స్ ఫలాలు కొనుగోలుదారులకు మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మార్కెట్ రేటు కిలో రూ.200లకు పైగా ఉండగా సేంద్రీయ వ్యవసాయ పద్దతిలో పండిస్తూ కూడా కిలో రూ.150కే ఇస్తు న్నట్లు తెలిపారు. జూన్ నుంచి నవంబరు చివరి వరకు విదేశీ డ్రాగన్ ఫ్రూట్స్ లభిస్తాయని, కొనుగోలుదారులు మినిమం 5కేజీల డ్రాగన్‌ఫ్రూట్స్ ఆర్డరు చేయాలని తెలిపారు.

# అన్నదాతలకు అండగా... ఖరీఫ్ సన్నద్ధతకు సిద్ధంగా

### రాయితీ విత్తనాలు అందజేసిన ప్రభుత్వం

**జిల్లాలో 82,500 హెక్టార్లలో పంటల సాగు అంచనా**

**వరి పంట సాధారణ విస్తీర్ణం 9,748 హెక్టార్లు**

**వేరుశనగ పంట సాధారణ విస్తీర్ణం 47,885 హెక్టార్లు**

**51,750 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ**

**14,602 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ**

**జాతీయ ఆహార భద్రత పథకం 750 కిట్లు వేరుశనగ, 9,000 కిట్లు కంది, 800కిట్లు రాగి, 150 కిట్లు కొర్ర చిరు సంచులు పంపిణీ**



రాయచోటి జులై 02, ప్రభాతవార్త

ఖరీఫ్ సీజన్ కు ముందే అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు వేసవి దుక్కులు చేయడంలో బిజీ అయ్యారు. ఖరీఫ్ పంటల సాగుకు భూమిని సిద్ధం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఖరీఫ్ సాగు ప్రణాళికలను సిద్ధం చేశారు. రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనాలు ఇప్పటికే పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సైతం కావలసినంత నిల్వ ఉంచారు.

**ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం**

జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 82,589 హెక్టార్లు. వరి పంట సాధారణ విస్తీర్ణం 9,748 హెక్టార్లు. వేరుశెనగ సాధారణ విస్తీర్ణం 47,885 హెక్టార్లు. ఖరీఫ్ సీజనులో నాణ్యమైన, ధ్రువీకరించిన వేరుశనగ విత్తనాలను రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసింది. కె-6, నారాయణి రకాల విత్తనాలను 40 శాతం సబ్సిడీ పోను కిలో రూ.51.48కి వ్యవసాయ అధికారులు రైతులకు అందజేశారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 47,885 హెచ్.ఎ. వేరుశనగ కనీస మద్దతు ధర రూ.5,550 కాగా గతేడాది రూ.6,500 వరకు పలికింది. ఈ ఏడాది రూ.6,800 నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది. మార్కెట్‌లో ఎమ్మెస్పీకి మించి ధర లభిస్తుండడంతో ఈసారి కూడా లక్ష్యానికి మించే సాగయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలతో పాటు వేరుశనగ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

**విత్తనాల కేటాయింపు ఇలా**

ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వేరుశనగ విత్తనాలు 52,085 క్వింటాళ్లు అవసరంగా వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు జిల్లాకు విత్తన కేటాయింపు జరిగింది. ఇందులో (మిగతా IIవ పేజీలో)

## ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల ఈవెంట్ తక్షణమే నిర్వహించాలి

II లో

## డాక్టర్లు దేవుడితో సమానం

II లో

## పుస్తకావిష్కరణ..



కడప కార్పొరేషన్, జులై 2, ప్రభాతవార్త:

కులాల అంతరాలు, అస్పృశ్యత నిర్మూలన అందరి హిందువుల బాధ్యత అని సామాజిక సమరసత జాతీయ కన్వీనర్ శ్యాంప్రసాద్ అన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని, నిజమైన ఎస్సీల ప్రగతికి అడ్డంకి అని పేర్కొన్నారు. ఎస్సీలు వ్యతిరేకించాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు నిజమైన ఎస్సీలకే అందేటట్లు ఇతర కులాల హిందువులు సహకరించాలని కోరారు. ఆదివారం కడప వీహెచ్‌పీ కార్యాలయంలో ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలా? పర్యవసనాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ గాంధీ మాట్లాడుతూ ఇంత వరకు ఎస్సీ హిందువులు అగ్ర కులాల నుంచి కుల వివక్షను ఎదుర్కొన్నారన్నారు. కొన్ని సంవత్సరాలుగా మతం మారిన ఎస్సీల నుంచి కూడా వివక్ష ఎదుర్కొంటున్నారని చెప్పారు. హిందూ ఉత్సవాల నిర్వహించుకోవడంలో అడ్డంకులు ఏర్పడుతున్నాయని తెలిపారు. మైనార్టీ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తమ సంస్థలలో ఎస్సీ హోదా ఇవ్వమని కోరడం ఎంత వరకు సబబని కక్కయ్య మటం నిర్వాహకులు వెంకట సుబ్బయ్య ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్, ఐఎన్‌టీఏసీహెచ్ మెంబర్ సట్టిబబా రవి, ధర్మ ప్రచారం పరిషత్ రాయలసీమ ఇన్‌ఛార్జి ఈశ్వర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు ఆర్థిక ఇవ్వాలి

### ఎపి రైతు సంఘం డిమాండ్




రాయచోటి జులై 02, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎకరాకు పదివేల చొప్పున సాగు చేయడానికి ఆర్థిక సహాయం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ దేవరా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కాటమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా మన రాష్ట్రంలో ప్రతి రైతు 2.45 లక్షల రూపాయల రుణ భారంతో ఉన్నారన్నారు. దేశంలో ఆత్మహత్యలలో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉన్నది. వీరిలో అత్యధికులు పేద రైతులు, కౌలు రైతులే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు ఆశాస్త్రీయంగా ఉన్నాయి. కనీస మద్దతు ధరలకు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేక పోతున్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వాలు ఆటకెక్కించాయన్నారు. రైతుసంఘాలు కోరుతున్నట్లు మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేసేందుకు ప్రభుత్వాలు ఏ మాత్రం సిద్ధంగా లేవు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న వాగ్దానం అమలుకు నోచుకోలేదు. మరోప్రక్క ప్రతి సంవత్సరం సాగు ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రజలందరికి ఆహారాన్ని అందిస్తున్న రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వాలలో చిత్తశుద్ధి లోపించింది. ఫలితంగా రైతు వ్యవసాయానికి దూరమవుతున్నారు. కౌలు రైతులు కూడా వ్యవసాయం చేయలేని దుస్థితి ఏర్పడింది. ఈ దశలో రైతులు, కౌలు రైతులం దరిని ఆదుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తరహాలో మన రాష్ట్రంలో ప్రతి రైతుకు ఎకరానికి 10 వేల రూపాయల సాగు సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నదన్నారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు అత్యధికులు రుణభారం అధికమై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలు నివారించడానికి 2 ఎకరాల వరకు సాగుచేస్తున్న ప్రతి రైతుకు రూ. 20 వేల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలి. రెండు ఎకరాలకు పైబడిన వారందరికి ప్రతి ఎకరాకు రూఎ 10 వేల చొప్పున సాయం అందించాలి. డా. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అమలు చేయాలి. పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల ఎరువులు పురుగు మందులు 99 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు, సాంబశివ, పరిదేశిరెడ్డి, రాజారెడ్డి, శంకర రెడ్డి, రామచంద్ర, సుదీర్ కుమార్, విశ్వనాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా...

(మొదటి పేజీ తరువాయి)



కె-6 రకం 37,512 క్వింటాళ్లు, నారాయణి రకం 14,573 క్వింటాళ్లు, కేటాయించారు.

**ఆర్బీకేలకు చేరిన ఎరువులు**

ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 39,956 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా గుర్తించారు. యూరియా 2,795 మెట్రిక్ టన్నులు, డీఏపీ 152, పొటాష్ 151, కాంప్లెక్సు ఎరువులు 236 మెట్రిక్ టన్నులు ఆర్బీకేలకు చేరాయి.

**జాతీయ ఆహార భద్రతా పథకం**

జాతీయ ఆహార భద్రత పథకం క్రింద 750 కిట్లు వేరుశనగ, 9,000 కిట్లు కంది, 800 కిట్లు రాగి, 150 కిట్లు కొర్ర చిరు సంచులను పంపిణీ చేయడం జరిగింది, గ్రామ విత్తన పథకం కార్యక్రమాన్ని సుండుపల్లి మండలం చిన్న గొల్ల పల్లి గ్రామంలో సజ్జ పంట పైన చేయడం జరుగుతుంది. కార్యక్రమంలో భాగంగా ఏబీవీ 04 రకం సజ్జ విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందించడం జరిగింది.

**ఖరీఫ్ సాగుకు సన్నద్ధం**

ఖరీఫ్ సీజన్ లో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నాం. వేరుశనగ విత్తనాల పంపిణీ వంద శాతం పూర్తయింది. కావలసినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే ఎరువులు సరఫరా ప్రారంభమైంది. నెలఖారుఖకు రైతు భరోసా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఎరువులు నిల్వ చేస్తాం. అనంతరం రైతులకు పంపిణీ చేస్తాం. జిల్లా వ్యాప్తంగా రైతులు వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలతో పాటు వేరుశనగ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

– చంద్రానాయక్, జిల్లా అగ్రికల్చర్ అధికారి

## తల్లిదండ్రుల ఆస్థిలో కుమార్తెలకు సమాన భాగం

### - ఏపి హైకోర్టు కీలక తీర్పు

బద్వేలు లీగల్, జూన్ 22 ప్రభాతవార్త :

భారత రాజ్యాంగం కల్పించిన ఆస్థి హక్కులో తల్లిదండ్రుల నుండి వారసత్వంగా కుమార్తెలకు ఆస్థి హక్కు దక్కడం లేదనే వాదన సర్వత్రా వినవస్తూనే ఉంది. అయితే సుప్రీం కోర్టు రిపోర్టబుల్ జడ్జిమెంట్ 2020 తీర్పు తరువాత దేశంలోనే మొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానంలోనే తొలి తీర్పు జారీ చేసింది. హిందూ ఉమ్మడి వారసత్వ ఆస్థుల (ఇన్‌హెరిటెన్స్ అసెట్స్)లో స్త్రీలకు పురుషులతో సమాన ఆస్థి హక్కు లభించనుంది. కీలక తీర్పు హిందూ వారసత్వ సవరణ చట్టం 2005 ప్రకారం తండ్రి వారసత్వపు ఆస్థిలో కుమార్తెలకు సమాన హక్కు కల్పిస్తూ ఆగష్టు 2020న సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. హిందూ వారసత్వ చట్ట ప్రకారం కుటుంబములోని ఆడబిడ్డలకు కుమారులతో పాటు సమాన ఆస్థి హక్కు కల్పిస్తూ 2020 లోనే సుప్రీం కోర్టు రిపోర్టబుల్ తీర్పు చెప్పింది. హిందూ వారసత్వ సవరణ చట్టం 2005 అమలుకు ముందే తండ్రి మరణించినప్పటికీ కుమార్తెలకు తల్లిదండ్రుల ఆస్థి పై హక్కు ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానంలోని జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. హిందూ వారసత్వ సవరణ చట్టం 2005 ప్రకారం కుమార్తెలకు తండ్రి ఆస్థిలో సంపూర్ణ హక్కు ఉంటుందని నిక్కచ్చిగా తేల్చి చెప్పింది. 2005 సెప్టెంబరు 9 నాటికి తండ్రి జీవించి ఉన్నారా? లేదా? అనే విషయంతో సంబంధం లేకుండా కుమార్తెకు వారసత్వ హక్కు ఉంటుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. 2005లో చట్టం అమలులోకి వచ్చే నాటికి తండ్రి చనిపోతే సోదరులు ఆస్థిలో వాటా నిరాకరించడంపై దాఖలైన పిటీషన్లను విచారించిన న్యాయస్థానం 2005 నాటికి తండ్రి మరణించినా లేక జీవించి ఉన్నా ఆడ పిల్లలకు సమాన వాటా దక్కాల్సిందేనని సుస్పష్టం చేసింది. ఈ అంశంపై ట్రయల్ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న విషయాలను 6 నెలల్లో నిర్ణయించాలని ధర్మాసనం ఆదేశించింది. ఆగష్టు 2020 తీర్పును అనుసరించి దేశంలోనే మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానంలో జూన్ 20 23 మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. వివరాలలోకి వెళితే గుం టూరు జిల్లా వడ్లమూడి గ్రామానికి చెందిన అచ్యుతని సీతారావమ్మ, సిరిపురపు స్వరాజ్య లక్ష్మీ, చుండూరు సావిత్రి దేవి, వీరికి మరో ఆరుగురు సహో దరులు న్నారు. వీరి తండ్రి కుమార్తెలకు ఆస్థిని వ్రాయించకుండానే స్వర్గస్తుడై నాడు. ఆస్థుల పంప కాల విషయాలలో వీరికి విభేదాలు తలెత్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 1986 నుండి వివిధ న్యాయస్థానాలలో పోరాడుతూ చివరకు 2010 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానమును ఆశ్రయించగా క్రింది కోర్టులో తమకు జరుగుచున్న అన్యాయంపై సిఆర్ నెం.1364/2010గా ఒక రివిజన్ పిటీషన్ దాఖలు చేయగా రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు నూతనంగా ఏర్పడిన న్యాయస్థానంలో ఈ ముగ్గురు మహిళా పిటీషనర్లకు అనుకూలంగా జస్టిస్ బి.వి.ఎల్.ఎన్.చక్రవర్తి దేశంలోనే మొట్టమొదటిసారిగా హిందూ సక్సెషన్ అమెండ్మెంటు యాక్టు 2005 ప్రకారం తీర్పును వెలువరించారు.

## చిన్నారి సోహిత్‌ది ముమ్మాటికి హత్యే

### టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్ డిమాండ్



ప్రొద్దుటూరు జులై 2, ప్రభాతవార్త

కడప సమీపంలోని బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న చిన్నారి సోహిత్ ది ముమ్మాటికి హత్యేనని తక్షణమే పాఠశాల సిబ్బందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పత్రిక ప్రకటన విడుదల చేసిన ఆయన తమ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించి ఉన్నత చదువులు చదివించే నేపథ్యంలో విధులకు వెనకాడకుండా చేర్పించిన తల్లిదండ్రులు చివరకు ఆయా పాఠశాలలు తమ బిడ్డలను విగత జీవులుగా అందించడం చాలా దారుణం అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా సొంత నియోజకవర్గానికి చెందిన మాడిశెట్టి సోహిత్ ను మైదుకూరు నియోజకవర్గం లోని వీరం రెడ్డి శ్రీధర్ రెడ్డి పాఠశాలల సిబ్బంది నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన ఘటన జిల్లా వ్యాప్తంగా అందరిని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. పాఠశాలలో చేరిన రెండు వారాలలో తమ బిడ్డ అత్యగావింపబడడం ఆ తల్లిదండ్రులకు తీవ్ర శోభకు గురిచేసిందన్నారు ఈ పాఠశాలలో వివిధ రకాల తరగతులకు అనుమతులు ఇచ్చిన విద్యాశాఖ అధికారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం సిబ్బంది దురుసుతనం ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుందన్నారు పైగా న్యాయం కోసం నిలదీయడానికి వెళ్లిన చిన్నారి సోహిత్ తల్లిదండ్రుల పైన బంధువుల పైన అధికార పార్టీ నాయకుల అండదండలతో పోలీసులు లాటించార్జి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయడంతో సరిపెట్టకోకుండా పాఠశాల సిబ్బంది పై హత్య కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు బాలుడి కుటుంబానికి 50 లక్షల రూపాయల నష్ట పరిహారం అందించాలని లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు రోజురోజుకు జిల్లా వ్యాప్తంగా వెనుకబడిన కులాలపై జరుగు తున్న దాడులను ఇకమీదట సహించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంటరీ టిడిపి దేవాంగ సాధికారిక సమితి కన్వీనర్ నాగసుబ్బరాయుడు టిడిపి వానించే విభాగం ఉపాధ్యక్షులు గోమేదికం సుదర్శన్ దేవాంగ సాధికారిక సమితి నియోజకవర్గ కన్వీనర్ బోధిన రాఘవేంద్ర టిడిపి బీసీ నాయ కులు ఆర్ మహేష్ బాబు ఊట్ల మల్లేష్ పాల్గొన్నారు.

## విద్యార్ధి మృతికి కారణమై వారిపై కఠిన చర్యలు చేపట్టాలి

### –జిహెచ్‌ఆర్ఎఎ చైర్మన్ కాసల కోనయ్య


గోపవరం,జులై 2 ప్రభాతవార్త;



బీరం శ్రీదర్‌రెడ్డి పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న సోహిత్ అనే విద్యార్ధి మృతికి కారణమైన వారిని గుర్దించి వారిపై కఠన చర్యలు తీసుకోవాలని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జాతియ్య చైర్మన్ శ్రీ కాసల కోనయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇటు వంటి దురదృష్ట సంఘటనలు పునరావృత్తం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా పాఠశాలలపై మెరుగులను చూచి తల్లితండ్రులు మోసపోతున్నారన్నారు. తల్లితండ్రులు ఎప్పటి కప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు వహించాలన్నారు. అవసరాన్ని బట్టి బాదిత కుటింబీకులకు తమ వంతు సహాయ సహాకారాలను అందించేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. ప్రతి పాఠశాలను ప్రత్యేకంగా పరిశీలించి విద్యార్దుల స్దితిగతులను గమనించేలా ఒక ప్రత్యేక బృందాన్ని కేటాయించాలన్నారు. ప్రదానంగా ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన సేవలను విద్యార్దుల తల్లితండ్రులు సద్వినియోగ పరచుకోవాలన్నారు. రోజు రోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తూన్న పాఠశాలల పట్లా అదికారుల పర్యవేక్షణ ఏ మాత్రం లేదన్నారు. ఇప్పటి కైనా జిల్లా విద్యాశాఖాది కారులు కఠినమైన చర్యలు తీసుకోకపోతే ఆద్వర్యంలో పోరాడతామన్నారు. బాధ్యత లేని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాడ్ చేసారు. కార్యక్రమంలో గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు గురుపౌర్ణమి వేడుకలు

రామసముద్రం జులై 2, ప్రభాతవార్త



రామసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వాలీశ్వర స్వామి ఆలయ ధర్మకర్త లక్ష్మీపతి ఆలయ అర్చకులు అనిల్ స్వామి మాట్లాడుతూ శ్రీ వాలీశ్వర స్వామి ఆలయ సమీపంలో వెలసి ఉన్న శ్రీ సాయి బాబా ఆలయము నందు నేడు గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ సాయి బాబాకు ఉదయం అభిషేకాలు అర్చనలు నిర్వహించి సాయంత్రం స్వామివారిని స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. గుంతల పేట గ్రామంలో వెలసియుండు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం నందు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. స్వామి వారికి అభిషేకాలు అర్చనలు ఆలయం వద్ద అన్నదాన కార్య క్రమాలు నిర్వహిస్తా రని తెలిపారు.

## నర్రెడ్డికి ఘన సన్మానం..



కడప వైద్యవిభాగం, జులై 2, ప్రభాతవార్త:

డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డిని డాక్టర్స్‌డే సందర్భంగా వేంపల్లెలో ఆయనను ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామాల వారికి వైద్య సేవలు అందించాలని ఆలోచన కలిగిన మొట్టమొదటి సారిగా గంగిరొడ్డులోని 4 రోడ్ల కూడలిలో శ్రీ సంగమేశ్వర క్లినిక్ ఆసుపత్రిని ప్రారంభించారని కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు తెలిపారు. ఎన్టీఆర్ రామారావు పార్టీ స్థాపించిన సమయంలో ఆయన పిలుపు మేరకు పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగారని తరువాత కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరి 20 సూత్రాల చైర్మన్‌గా బాధ్యతలు చేపటి పలు కీలక పదవలు అధిరోహించారని కొనియాడారు.

## ఘనంగా గాయత్రి మహా యజ్ఞం



కమలాపురం, జులై 2, ప్రభాతవార్త:

కమలాపురం అఖండ రుషి గురు కూటమి వైజ్ఞానిక, ఆధ్యాత్మిక జ్ఞాన కేంద్రంలో ఆదివారం వైజ్ఞానిక ఆధ్యాత్మిక పద్ధతిలో గాయత్రి మహా యజ్ఞం ప్రధానాచార్యులు పి.విజయ భాస్కర్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. యజ్ఞంలో వైజ్ఞానిక ఆధ్యాత్మిక పద్ధతిలో ఆషాడ ఏకాదశి రోజు మహత్యం, గురు పౌర్ణమి విశిష్టత, సద్గురు దర్శనం సత్సంగ రూపేనా జరిగింది. పాలకులకు, పోలీసు వ్యవస్థకు, రైతులకు, ప్రజాస్వామ్యానికి లోక కల్యాణం కోసం యజ్ఞంలో 24 గాయత్రీదేవి ఆహులు, నవగ్రహ ఆహుతులు, మహా మృత్యుం జయ ఆహుతులు, వరుణ దేవుని ఆహుతులు వేశారు. సకాలంలో వర్షాలు పడి, ఎండలు తగ్గి ప్రకృతి సస్యశ్యామలంగా ఉంటుందని ప్రధాన ఆచార్యులు తెలిపారు. యజ్ఞంలో సుమారు 20 మంది భక్త జనులు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం భోజన ప్రసాదం జరిగినది.

**యజ్ఞంలో 5 సంకల్పాలు సంకల్పించారు**

గోవులు సంపూర్ణ అభివృద్ధి, బ్రాహ్మణ అభివృద్ధి (అగ్రహార), ప్రతి ఒక స్త్రీ నిత్య ఆనందంగా జీవించడం కోసం, రైతులకు నిత్య ఆనందంతో ధన అభివృద్ధి కలిగే దాని కోసం, (రైతులకు ఉపయోగపడే వ్యక్తులకు), వైజ్ఞానిక ఆధ్యాత్మిక రాజకీయం పరివర్తనం కోసం.

## వైద్యో నారాయణో హరి

ప్రొద్దుటూరుఅర్బన్ జులై 2, ప్రభాతవార్త

వైద్యులు దైవం తో సమానమని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శెట్టిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ నందు సేవా భావము కలిగి కరోనా సమయంలో పేదలకు సేవ చేసిన డాక్టర్లు నాగ దస్తగిరి రెడ్డి, వరుణ్ కుమార్ రెడ్డి, అక్షిత్ రెడ్డి లను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి, రోటరీ ట్రస్ట్ ప్రెసిడెంట్ కోటా శశివకుమార్, డి జి ప్రభు, జి రామకృష్ణ, సూర్య నారాయణ రెడ్డి, బాలాజీ, కాబోయే గవర్నర్ సాధు గోపాలకృష్ణ, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## చేతన ఫౌండేషన్ సహకారంతో కట్టుమిషన్లు పంపిణీ



ప్రొద్దుటూరు జులై 2, ప్రభాతవార్త

స్వయం ఉపాధిలో మహిళ లోకానికి అండగా నిలవడం సేవా సంస్థల అవసరం ఉందని చేతన ఫౌండేషన్ సభ్యులు దొడ్డ సీతారామయ్య అన్నారు. వికసిత ఫౌండే షన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందినటువంటి మహిళలకు చేతన ఫౌండేషన్ ద్వారా ఆదివారం వికాసిత ఫౌండేషన్ ప్రాంగణంలో కుట్టుమిషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దండపాని శ్రీని వాస్ కుమార్, నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి మణికంఠ టీటీడీ మాజీ బోర్డు నెంబర్ చిప్పగిరి ప్రసాద్, భయపురెడ్డి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నెహ్రూ యువ కేంద్ర మణికంఠ, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫి కెట్లు అందజేశారు. ముత్తినేని సురేష్, చంద్రకానీ నవీన్, షేక్ రషీద జనని సేవా సంస్థ అధ్యక్షుడు మస్తాన్ వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన విద్యార్థులు..



కడప కార్పొరేషన్, జులై 2, ప్రభాతవార్త:

శిల్పారామంలో పాఠశాల విద్యార్థుల నృత్యాలు వీక్షకులను కనువిందు చేశాయి. విస్పా మూవీ పద్మాకర్ సహకారంతో ఆదివారం కడప శిల్పారామంలోని సాంస్కృతిక కళావేదికపై డ్యాన్సలు వీక్షక ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విజిల్స్ డ్యాన్స్ అకాడమీ బృందంపల్లె జానపద నృత్యాలు అలరించాయి. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

## వివాహ వేడుకల్లో యువనాయకులు అతికారి దినేష్

సుండుపల్లి జులై 2, ప్రభాతవార్త



సుండుపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మేకల మహబూబ్ బాషా కనిష్ట పుత్రుడు సర్దార్ భాష నిక్కా వేడుకల్లో రాజంపేట నియోజకవర్గ జన సేన పార్టీ యువ నాయకులు అతికారి దినేష్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అధికార ప్రతి నిధి, రెడ్డి రాణి, సిద్ధవటం సర్పంచ్ ప్రతినిధి భవనాసి ఓబులయ్య, ఉప సర్పంచ్, మైనారిటీ సోదరులు హిదాయత్ పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులు ఎం నాగరాజా, పోలిశెట్టి శ్రీనివాసులు, దుగ్గిళ్ళ నాగార్జున, వెంకటేష్ పాల్గొన్నారు

## ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల ఈవెంట్ తక్షణమే నిర్వహించాలి

### – యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్‌కుమార్



కడప వైద్యవిభాగం, జులై 2, ప్రభాతవార్త:

ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలు రాసి నెలలు గడుస్తున్నా ఈవెంట్స్‌పై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో నిరుద్యోగ యువత ఆశావహులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సుమం త్ కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను తీవ్రమైన నిరాశ మిగిల్చారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల విరమణ వయస్సు 62కు పెంచి రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలను మరింత దూరం చేశారన్నారు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎస్సై, కానిస్టేబుల్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఈవెంట్స్ మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ కోసం ముఖ్యంగా డీఎస్సీ గ్రూప్స్-2,3,4 పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు చేసే కాలయాపన వల్ల వయసు పైబడి చాలా మంది నిరుద్యోగ యువత అనర్హులుగా మిగులుతున్నారని వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచరించారు. తక్షణమే క్వాలిఫై అయినా ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించాలని లేనిపక్షంలో అభ్యర్థులను నిరుద్యోగులను కలుపుకొని పెద్ద ఎత్తున యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు వంశీ యాదవ్, ప్రభుకుమార్, చక్రి, ప్రవీణ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## కవితా పురస్కారం ప్రదానం..

ప్రొద్దుటూరు క్రైం, జులై 2, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు కాశీవరపు వెంకట సుబ్బయ్య రాసిన ఎదమీటిన రాగాలు కవితా సంపుటికి ప్రతిష్టాకరమైన కొలకలూరి ఇనాక్ జాతీయ కవితా పురస్కారం ప్రకటించారు. కాశీవరపు వెంకటసుబ్బయ్య కవిగా కథా రచయితగా ప్రసిద్దులు. ఈయన కవితలు, కథలు ప్రముఖ పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. ఈయన 1960లో చిన్నక్క, వెంకట సుబ్బన్న దంపతులకు జన్మించారు. ఈయన బీకాం చదివారు. అనేక ప్రసిద్ధ కవి రాధేయతో కలిసి చైతన్య కార్యక్రమాలు నిర్వహించి తనవంతు భాషా సేవా చేశారు. కాశీవరపు వెంకట సుబ్బయ్యను సాహితీ మిత్ర మండలి, పెన్నోత్సవం-2004, జార్జ్ క్లబ్, గాజులపల్లి పెద్ద సుబ్బయ్య, సుబ్బమ్మ సేవా సమితి స్నేహం సేవా సమితి కళా స్రవంతి, తెలుగు సాంస్కృ తిక సంస్థ, ఎన్టీఆర్ అభిమాన సంఘం, తెలుగు రక్షణ వేదిక, వండర్ బుక్ రికార్డ్స్, గోదావరి పురస్కారం, కృష్ణా పుష్కర పురస్కారం, స్వామి క్రియే షన్స్, కృష్ణదేవ రాయల సాహితి సమితి కళా భారతి మొదలైన సంస్థలు సన్మా నించి సత్కరించాయి. కాశీవరపు వెంకట సుబ్బయ్య కొలకలూరి ఇనాక్ జాతీయ కవితా పురస్కారానికి ఎన్నిక కావడం పట్ల పలువురు సాహితీవేత్తలు, సంతోషాన్ని వ్యక్తం చేస్తూ అభినందనలతో ముంచెత్తారు.

## శ్రీనివాసనగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



ప్రొద్దుటూరు క్రైం, జులై 2, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు టుటౌన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఆదివారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాలనీలో అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో ప్రొద్దుటూరు టుటౌన్ ఎస్సై రెడ్డి సరేష్, సిబ్బంది పాల్గొన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డాక్టర్లు దేవుడితో సమానం



కడప వైద్యవిభాగం, జులై 2, ప్రభాతవార్త:

ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి వల్ల ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని డాక్టర్లు తమ ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసిన దేవుళ్లని 44వ డివిజన్ తెదేపా ఇన్‌ఛార్జి పఠాన్ ఖాజాపీర్ అన్నారు. శనివారం డాక్టర్స్ డే సందర్భంగా కడప నగరంలోని లైఫ్‌లైన్ హాస్పిటల్ నందు డాక్టర్స్ డే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లైఫ్ లైన్ హాస్పిటల్ అధినేత డా.షేక్ రబ్బాని గారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో డాక్టర్ షేక్ రబ్బానీ బాషా ప్రజలకు మరింత సేవలు అందించాలని ప్రజలతో మమేకమై డాక్టర్ వృత్తికే వన్నె తీసుకురావాలన్నారు. కరోనాలో మంచి వైద్య సేవలు అందించారని గుర్తింపు ఉన్న రబ్బాని బాషా మరింత పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రెహామాన్, దినేష్, ప్రణయ్ పాల్గొన్నారు.

## మోకాలి మార్పిడి శ్త్ర చికిత్సలో విప్లవాత్మక మార్పులు

### – ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ వివేకానందరెడ్డి

కడప వైద్యవిభాగం, జులై 2, ప్రభాతవార్త:



నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇప్పటి వరకు మహా నగరాలకే పరిమితమైన రోబోటిక్ సర్జరీని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆర్థోపెడిక్ వైద్యులు డా.వివేకానందరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక అరుణాచలం ఆసుపత్రి లో ఆయన మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు అత్యధిక టెక్నాలజీతో నిర్వహించే ఈ రోబోటిక్ సర్జరీ ఇప్పటికే విజయవంతమైందని తెలిపారు. నెల్లూరు జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల వారి సౌకర్యార్థం ఈ రోబోటెక్ సర్జరీ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గతంలో నిర్వహించే ఇంప్లాంట్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో కొన్నిసార్లు వంకర్లు వచ్చే ఇబ్బందులు ఉండవని అయితే రోబోటెక్ మోకాలి మార్పిడి సర్జరీ ద్వారా కచ్చితత్వంతో పాటు వంద వంద శాతం రోగికి ఎటువంటి ఇబ్బంది లేకుండా నొప్పి తక్కువగా ఉండడం త్వరగా రికవరీ కావడం వంటివి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఈ రోబోటెక్ సర్జరీలో ముందుగా కంప్యూటర్‌లో 3డి నమూనాను కొని రూపొందించుకొని ఆ తరువాత రోగి సిటీ స్కాన్ ఆదారంగా ఏఏ భాగంలో ఆపరేషన్ చేయాలో ఒక కచ్చితమైన వర్చువల్ ప్లానింగ్ ఏర్పాటు చేసుకొని రోబోటెక్ ఆర్మ్ అసిస్టెండ్ టెక్నాలజీ ద్వారా వైద్యుల ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డా.నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

# జూలై మాసాంతానికి రూ.కోటి వాటర్ షెడ్ పనులు

– వాటర్‌షెడ్ జేఈ సురేష్



తంబళ్లపల్లె, జులై 2, ప్రభాతవార్త:

మండలంలోని 10 వాటర్ షెడ్లలో జులై నెల ఆఖరికి రూ.కోటి అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి లక్ష్యంగా ఎంచుకున్నట్లు వాటర్‌షెడ్ జేఈ సురేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీడీ మద్దిలేటి ఆదేశాల మేరకు పీవో ఖాజా మొహిద్దీన్ సారథ్యంలో మండలంలోని గంగిరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలోని దిగువపాలెం, జుంజురపెంట, గుండ్లపల్లి, మర్రిమాకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని కోటకొండ, కుక్కరాజుపల్లి, కన్నెమడుగు, ఎద్దులవారిపల్లి, రేణిమాకులపల్లి వాటర్ షెడ్లలో ఇప్పటికే పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు చెప్పారు. గంగిరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలోని వాటర్ షెడ్లలో రూ.39.60 లక్షలు, మర్రిమాకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని వాటర్ షెడ్లలో రూ.33.40లక్షలతో రాతి కట్టడాలు, మినీ సర్క్యులేషన్ ట్యాంక్‌లు, సర్క్యులేషన్ ట్యాంకులు, చెక్ వాల్వ్‌లు, చెక్ డ్యాంలు, కమత కందకాలు, నీటి తొట్టెలు, రచ్చబండలు నిర్మాణాలు, సిమెంటు బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వాటర్ షెడ్ పనులు వాటర్ షెడ్ ఛైర్మన్లు, మెంబర్లు, సలహాలు, సూచనలతో నాణ్యతా లోపం లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు.

# దళిత భూములను కబ్జాచేస్తే జైలుకు పంపుతాం

ఎస్‌సి కమీషన్ ఛైర్మెన్ విక్టర్ ప్రసాద్



మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :

దళిత భూములను కబ్జా చేస్తే జైలుకు పంపడం ఖాయమని ఎస్‌సి కమీషన్ ఛైర్మెన్ మారుమూరి విక్టర్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం బికెపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 522/1లో భూమి అన్యాక్రాంతం కావడంతో దళితుల ఫిర్యాదుల మేరకు ఆయన అక్కడికి విచ్చేశారు. అక్కడికి విచ్చేసి రెవెన్యూ రికార్డులు పరిశీలించి అధికారులతో ఛైర్మెన్ చర్చించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత భూముల కబ్జాకు పాల్పడిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి యాక్టు కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. బికెపల్లె గ్రామంలో దళితుల భూమిని ఓ రిటైర్డు జడ్జి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని దళిత కుటుంబం తమ వద్దకు వచ్చి విన్నవించుకోవడంతో నేరుగా ఈ సమస్యపై విచారణకు రావడం జరిగిందన్నారు. దళిత భూములు దురాక్రమణకు గురైందని ఫిర్యాదు మేరకు పరిశీలనకు వస్తే వెయ్యికోట్లు భూములు కబ్జాకు గురైనట్లు తెలిసిందన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో దళిత భూములు ఎక్కడ కబ్జాకు గురైన ఆ భూములన్నీ తిరిగి దళితులు ఆక్రమించేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, తహశీల్దార్ మహమ్మద్‌చాంద్, రెండవ పట్టణ సిఐ మురళి, దళిత నాయకులు ముని వెంకటప్ప, జయకుమార్, ముత్యాలమోహన్, మనోహర్‌రెడ్డి, రాయల్‌సూర్య, చిన్నా, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష సంతకాల సేకరణతో ప్రభుత్వాల కళ్ళు తెరిపించాలి

వాల్మీకిసంఘం వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు



మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :

లక్ష సంతకాల సేకరణతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కళ్ళు తెరిపించాలని వాల్మీకిసంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం నక్కలదిన్నెలో వాల్మీకిసంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వాల్మీకి కుటుంబసభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వాల్మీకులు అందరూ చేయి చేయి కలుపుదాం,వాల్మీకుల ఎస్‌టి పునరుద్దరణ సాధిద్దామంటూ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వాల్మీకుల స్థితిగతులు తెలిసే విధంగా లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రతి వాల్మీకి కుటుంబసభ్యులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. లక్ష సంతకాల సేకరణ అనంతరం రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష పార్టీల నాయకులకు పంపి ఎస్‌టి పునరుద్దరణ ఆకాంక్ష ఎంత భలంగా ఉందో తెలియజేయాలన్నారు. దశాబ్దాలుగా వాల్మీకులు వెనుకబడి ఉన్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు జయసింహ, మంజునాథ్, భాస్కర్, గంగాధర్, నరసింహులు, నారాయణ, చంద్రన్న, రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లెలో శాంతి భద్రతలకు ప్రాధాన్యత

– ఎస్సై శోభారాణి



తంబళ్లపల్లె, జులై 2, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో ప్రజల శాంతిభద్రతలకు మొదటి ప్రాదాన్యతను ఇస్తామని ఎస్సై శోభారాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, జూదం, కర్నాటక అక్రమ మద్యం, నాటు సారా అమ్మకాలపై నిఘా పెంచినట్లు చెప్పారు. మండలంలోని 12 సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసుల సహకారంతో మారుమూల గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారిని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా దిశా యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఎక్కడైనా మహిళలపై జరిగే అఘాయిత్యాలను తమ దృష్టికి తెస్తే సత్వరం పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు సైతం తమ గ్రామాల పరిధిలో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై స్థానికంగా గల మహిళా పోలీసుల దృష్టికి తెస్తే తద్వారా వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# జనసేన పార్టీని ఆదరించండి

రాయలసీమ కన్వీనర్ రాందాస్‌చౌదరి



మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :

జనసేన పార్టీని ఆదరించాలని ఆపార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందా స్‌చౌదరి తెలిపారు. ఆదివారం పట్టణంలోని నక్కలదిన్నె బిటి కళాశాల మైదానంలో జనసేన పార్టీ జనంతో టి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జనసేన పార్టీ వ్యవస్తాపకులు వారాహీ యాత్ర ఘనంగా జరుగుతుండడంతో వైసిపి పేటిఎం బ్యాచ్ పవన్‌కళ్యాన్ గురించి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని భూస్థాపితం చేసి జనసేన పార్టీ అధికారంలోకి రావడం ఖాయమ న్నారు. జనంతో టీ జనసేన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు జంగాల శివరామ్, జగదీష్, సనావుల్లా, మోహన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు

కురబలకోట, జులై 2 ప్రభాతవార్త :



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసిఏ చదువు తున్న విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అం దజేసినట్లు కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఎంసిఏ మొదటి సంవత్సరం చదువుతున్న జయశ్రీ, శోభారాణిలకు జాతీయ స్థాయి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. జయశ్రీకి రూ.59,100లు, శోభరాణికి రూ.57, 100లు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ విద్యార్థులను కళాశాల కరస్పాం డెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళు, ప్రిన్సిపాల్ యువరా జ్, స్టూడెంట్స్ వేల్ఫేర్ ఆఫీసర్ సమీనా, మౌళాలిలు అభినందించారు.

# నేడు మట్లివారిపల్లెకు ఎమ్మెల్యే

కురబలకోట, జులై 2 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సోమవారం మండలంలోని మట్లివారిపల్లెలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# టమోటా ఛాలెంజ్ పేరుతో రైతులకు టోకరా

టిడిపి పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్

మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :



టమోటా ఛాలెంజ్ పేరుతో రైతులకు టోకరా వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు పొందుతున్నాయని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ తెలిపారు. గత వారం రోజులుగా టమోటాకు గణనీయంగా ధరలు ఉండడంతో ఓర్వలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టమోటా రేటు తగ్గించాలని ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సమీక్ష జరిపి టమోటా ఛాలెంజ్ పేరుతో టమోటా గ్రాండ్ ఛాలెంజ్ హే కడాన్ పేరుతో రైతుబజారులో టమోటా తక్కువ రేట్లకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించడం వలన వ్యాపారస్తులకు తగు సూచనలు ఇచ్చి ఆదివారం టమోటా మార్కెట్ యార్డులో రేట్లు తగ్గించడం జరిగిందన్నారు. గిట్టుబాటు లేనప్పుడు పట్టించుకోని ప్రభుత్వాలు ధరలు ఉన్నప్పుడు రైతుకు అన్యాయం చేయడం భావ్యంకాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాటకొండ మధబాబు, నవీన్‌చౌదరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘానికి ఇన్‌ఛార్జి సీఈవో నియామకం

దువ్వూరు, జులై 2, ప్రభాతవార్త:

దువ్వూరు ప్రాథమిక సహకార సంఘానికి ఆదివారం ఇన్‌ఛార్జి సీఈవోగా కె.రామ్మోహన్‌ను జిల్లా సహకార శాఖాధికారులు నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న పూసా రమణారెడ్డి ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సీఈవోగా రామ్మోహన్‌ను నియమించారు. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టి సకాలంలో రుణాలు ఇస్తామని అలాగే రైతులు కూడా సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

# మహిళల్ని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మదనపల్లెక్రైం, జులై 2 ప్రభాతవార్త :

మహిళలను నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిఐ మహమ్మద్‌బాషా తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. విజయవాడ ఏపి మైనింగ్ డెవలప్‌మెంటు కార్పోరేషన్ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్న సీన్నీ అలియాస్ చందుచౌదరి(35), పట్టణానికి చెందిన ఉషారాణితలో పరియం ఏర్పరచుకొన్నాడు. అనంతరం ఆమెను నమ్మించి రూ.25లక్షలు నగదు, 400గ్రాముల బంగారుతో పాటు హైదరాబాదులో ఒక ప్లాటు మదనపల్లెలో రెండ్లు ప్లాట్లు రిజిష్టర్ చేయించుకొన్నాడు. వాటిని తిరిగి ఇవ్వాలని ఆమె కోరడంతో చంపేస్తానని బెదిరించడం మొదలుపెట్టాడు. అతని బెదిరింపులకు బయపడిన ఉషారాణి, చందుచౌదరిలపై ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సిఐ తెలిపారు.

# త్రిరత్నాలు

జైనమతంలో ప్రస్తావించినట్లు బౌద్ధమతంలో కూడా త్రిరన్నాల గురించి ప్రస్తావించారు. బుద్ధుడు, ధర్మ, సంఘం అనేవి బౌద్ధ త్రిరత్నాలు. వీటినే బౌద్ధ సంప్రదాయంలో,

**1.**బుద్ధం శరణం గచ్ఛామి

**2.** ధర్మం శరణం గచ్ఛామి

**3.** సంఘం శరణం గచ్ఛామి అని పేర్కొటారు. ప్రతి బౌద్ధ మతస్తుడు వీటిని తప్పనిసరిగా ఆచరించాలి.

**మధ్యేమార్గం:**బౌద్ధమతం మోక్షసాధనకు చూపిన మార్గాన్ని మద్యేమార్గం అంటారు. జైనమతం మోక్షసాధనకు అహింసతో కూడిన సల్లేఖన వ్రతాన్నిసూచించగా,బుద్ధుడు అష్టాంగమార్గాన్ని తెలియజేశాడు. బౌద్ధమతాన్నే ప్రతీయ– సము త్పాదన సిద్దాంతంగా పేర్కొంటారు.

**సాహిత్యం:** బౌద్ధమత గ్రంథాలను త్రిపీటకాలు అంటారు. అవి వినయ పీటకం, అభిదమ్మ పీటకం,వీటిని ప్రాకృత భాషలో రంచించారు. హీనయానులు ప్రాకృతభాషను ఉపయోగిం చగా, మహాయానులు సంస్కృతానికి ప్రాధా న్యం ఇచ్చారు.ముఖ్యంగా ఆచార్య నాగారు ్జనుడు సంస్కృతంలో సుహృలేఖ, రత్నావళి రాజపరికథ, ఆరోగ్యమంజరి, రససిద్దాంతం లాంటి గ్రంథాలను రచించాడు. వీటితో పాటు సింహాళ గ్రంథాలైన మహావంశ, దీపవంశ విలువైన సాహిత్యంగా పేరొందాయి.

## బౌద్ధ సంగీతులు

బుద్ధుడి మరణానంతరం బౌద్ధమత అబి. వృద్ధికి జరిగిన సమావేశాలనే బౌద్ధ సంగీతు లుగా పేర్కొన్నారు. మొత్తం నాలుగు బౌద్ధ సంగీతులు జరిగాయి.

**మొదటి సంగీతి:** ఇది క్రీ.పూ. 483లో రాజ గృహంలో అజాతశత్రువు కాలంలో జరి గింది. మొదటి బౌద్ధ సంగీతికి మహాకశ్యపుడు అధ్యక్షత వహించాడు. ఈ సమావేశంలోనే మొదటి రెండు పీటకాలను (వినయ,స్తుత) సంకలనం చేశారు.

**రెండో సంగీతి:** ఇది క్రీ.పూ.383లో వైశాలి నగరంలో కాలాశోకుడి కాలంలో జరిగింది. దీనికి అధ్యక్షుడు సబకామి.

**మూడోసంగీతి:** ఇది క్రీ.పూ 250లో పాటలీ పుత్రంలో అశోకుడి కాలంలో జరిగింది. ఈ సమావేశానికి మొగలిపుతతిస్స అధ్యక్షత వహించాడు. ఈ సంగీతిలోనే అభిదమ్మ పీట కాన్ని సంకలనం చేశారు.

**నాలుగో సంగీతి:** ఇది క్రీ.శ. 100లో కశ్మీర్ (కుందనవనం) లో కనిష్కుడి కాలంలో జరి గింది.

# అనాథ వికలాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ



కమలాపురం, జులై 2, ప్రభాతవార్త:

నగర పంచాయతీ పరిధిలోని వాసవీ క్లబ్ వారి డాన్ టు డస్క్ సందర్భంగా ఆదివారం కమలాపురం వాసవీ క్లబ్ తరుపున 30 మంది వికలాంగులకు వస్త్ర దానం, నిత్యావసర సరుకులు పంపిణీ, కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ అధ్యక్షుడు బచ్చు సుబ్రమణ్యం, కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ వాసవీ క్లబ్ వారి డాన్ టు డస్క్ సందర్భంగా నగర పంచాయతీ పరిధిలోని వికలాంగులకు, వృద్దులకు నిత్యావసర సరుకులు వస్త్రాలు పంపిణీ చేశామన్నారు. అదే విధంగా దేశ భద్రతను కాపాడిన విశ్రాంత సైనికుడు ఈశ్వరయ్యకు సన్మానం. పేద రైతుకు యూరియా వితరణ, అలాగే కమలాపురం ఖాజీపేట మార్గంలో సుస్వాగతం కమలాపురం అను సూచిక బోర్డు కూడా ఆవిష్కరించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు శ్రీ కామిశెట్టి రమణయ్య, కోశాధికారి గాజుపల్లె శేఖర్, కమలాపురం ఆర్యవైశ్య సంఘం నాయకులు మాలేపాటి మల్లికార్జునరెడ్డి, సురేష్, అంబటి సునీల్, కామిశెట్టి చక్రవర్తి, గాజులపల్లె శంకర్‌రావు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# దుర్యోదన వధతో ముగిసిన మహాభారతయజ్ఞం



కేవి.పల్లె, జూలై 02 ప్రభాతవార్తః

మండలంలోని గర్నిమిట్ట జరుగుతున్న పంచమవేద మహాభారత యజ్ఞం ఆదివారం దుర్యోధన వధతో ముగిసింది. పగలు గీతావాణి భాగవతారిని ధర్మరాజుల పట్టాభిషేకం హరికథాగానం చేశారు. శ్రీవెంకేటశ్వర నాట్య కళామండలి వారిచే దుర్యోదన నాటక ప్రదర్శన చేశారు.ఈఘట్టాన్ని తిలకించడానికి అధిక సఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ద్రౌపతీ సమేత శ్రీకష్ణ పరమాత్మ పంచ పాడవుల విగ్రహాలకు పూజలు జరిపారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ గజ్జల శ్రుతి, గజ్జల శీనురెడ్డి, సుబ్బారెడ్డి, యల్లయ్య సర్పంచి రమణమ్మ, ఉప సర్పంచి వేణు గోపాల్ డాబా బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోబోటిక్ సర్జరీపై అపోహలకు గురికావొద్దు

రోబోటిక్ ద్వారా 50 సర్జరీలు విజయవంతం

– డా॥ వివేకానంద రెడ్డి



బద్వేలు అర్బన్, జూలై 02 ప్రభాతవార్త :

రోబోటిక్ సర్జరీల పట్ల ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావలసిన అవసరం లేదని నెల్లూరు అపోలో సూపర్ స్పెషాలిటీ కీళ్ళ మార్పిడి, ఆర్థోస్కోపిక్ మరియు వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డా॥ వివేకానంద రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక నిర్వాణ హాస్పిటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డా॥ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో ఇప్పటి వరకూ మహా నగరాలకే పరిమితమైన రోబోటిక్ సర్జరీని అందుబాటులోకి తీసుకువచ్చామని, మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సలు అత్యాధునిక టెక్నాలజీతో నిర్వహించే ఈ రోబోటిక్ సర్జరీలు ఇప్పటికే 50 మందికి చేపట్టామని, సర్జరీ చేసిన 15 రోజుల లోపే పూర్తి స్థాయిలో రికవరీ అయి సాధారణ స్థితికి వచ్చారన్నారు. రోబోటిక్ ద్వారా సర్జరీ చేసేటపుడు 3డి స్కానింగ్ ద్వారా డాక్టర్ల పర్యవేక్షణలోనే సర్జరీలు జరుగుతాయన్నారు. గతంలో నిర్వహించే ఇంప్లాంట్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో కొన్ని సార్లు వంకరలు వచ్చే ఇబ్బందులు ఉండేవని, అయితే రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జరీ ద్వారా కచ్చితత్వంతో పాటు నూటికి నూరు శాతం రోగికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండడం నొప్పి, కోత తక్కువగా ఉండడం, త్వరగా రికవరీ వంటివి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ రోబోటిక్ సర్జరీలో ముందుగా కంప్యూటర్‌లో 3డి నమూనాను రూపొందించుకుని, ఆ తరువాత రోగి సిటీ స్కాన్ ఆధారంగా ఏ భాగంలో ఆపరేషన్ చేయాలో ఒక ఖచ్చితమైన వర్చువల్ ప్లానింగ్ ఏర్పాటు చేసుకొని రోబోటిక్ ఆర్మ్ అసిస్టెండ్ టెక్నాలజీ ద్వారా వైద్యులు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేస్తారని చెప్పారు. దీని ద్వారా రోగి త్వరగా కోలుకోవడంతో పాటు శస్త్ర చికిత్స అనంతరం కూడా నొప్పి తక్కువగా ఉండి సాధారణ కార్యకలాపాలను కొనసాగించుకోగలుగుతారని వెల్లడించారు. మహా నాగరాలకే పరిమితమైన ఈ మోకాళ్ళ మార్పిడి రోబోటిక్ సర్జరీని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకువచ్చామని, దీనిని కడప మరియు బద్వేలు పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత సంవత్సర కాలంగా నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో అనేక రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జరీలు డా॥ వివేకానందరెడ్డి నేతృత్వంలో విజయవంతంగా జరగడం విశేషం. రోబోటిక్ సర్జరీలపై ప్రజలకు పలు మార్లు అవగాహన కల్పించడం జరిగిందని, కావున ప్రతి ఒక్కరు కూడా రోబోటిక్ సర్జరీలపై అపోహలు వీడి సద్వినియోగం చేసుకోవాలని విలేకరుల సమావేశంలో వారు తెలిపారు.

# నివాళులర్పించిన బిసిఎల్ అధ్యక్షులు



కురబలకోట, జులై 2 ప్రభాతవార్త :

మదనపల్లె రూరల్ టిడిపి అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు తండ్రి మరణించడంతో ఆదివారం సిటిఎం గ్రామం నల్లగుట్లపల్లెలో రాజంపేట పార్లమెంటు బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల కుటుంబసభ్యులను సురేంద్రయాదవ్ పరామర్శించారు. ఈయనతో పాటు మోహన్‌రెడ్డి, బొగ్గుభాస్కర్, శంకర్‌రెడ్డి, రాజారెడ్డిలు కలరు.

# కురబలకోటకు పంటల భీమా రూ.25లక్షలు మంజూరు

కురబలకోట, జులై 2 ప్రభాతవార్త :

కురబలకోట మండలంలో వర్షాదారంతో దెబ్బతిన్నపంటలకు రూ.25లక్షలు మంజూరు అయినట్లు అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. మండలంలోని 2246మంది రైతులకు ఈ నష్టపరిహారం మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. రైతులు ఏదైనా పంట సాగు చేస్తే వెంటనే రైతుభరోసా కేంద్రాల్లో ఈ క్రాప్ బుక్కింగ్ చేస్తే ప్రభుత్వం నుంచి అందే నష్టపరిహారం, రాయితీలు రైతులకు అందుతాయని ఆయన తెలిపారు.

# పెద్దేరు ప్రాజెక్టులో పర్యాటకుల సందడి



తంబళ్లపల్లె, జులై 2, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం జుంజురపెంట పంచాయతీ పరిధిలోని పెద్దేరు ప్రాజెక్టు ఈ మధ్య కురిసిన వర్షాలకు మొరవ పోతోంది. ఆదివారం పెద్దేరు ప్రాజెక్టు సందర్శనకు పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ప్రాజెక్టు మొరవ నీటితో పాటు ప్రాజెక్టు కింద భాగాన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి చేసిన పార్కులను పర్యాటకులు, చిన్నారులు సాయంత్రం వరకు ఆస్వాదించారు. తంబళ్లపల్లెతో పాటు మదనపల్లె, సత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లాల్లోని పలు మండలాల నుంచి పర్యాటకులు రావడం విశేషం.

# నిరుద్యోగులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



వాల్మీకిపురం, జూలై 2 ప్రభాతవార్తః

నిరుద్యోగులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వాల్మీకిపురం కలికిరి, మండలాల అంగన్‌వాడీ సహాయకులుగా ఎంపికైన మహిళలకు ఆదివారం స్తానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్యే నియామక పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని విధులను బాధ్యతతో నిర్వర్తించుకోవాలని సూచించారు , అంగన్‌వాడీలకు వచ్చే నిరుపేద చిన్నారులు ఆరోగ్యంపై ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంటుందని విధుల్లో చేరిన మహిళలు పారదర్శకంగా చిన్నారులకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని భారతి, సర్పంచి గంగులమ్మ, ఉప సర్పంచి కేశవరెడ్డి, ఆర్‌బీకే ఛైర్మన్ భాస్కర్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చీరలు పంపిణీ



కలికిరి, జూలై 2 ప్రభాతవార్తః

స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయం నందు పనిచేస్తున్నటువంటి మహిళలకు రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో భక్త మల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ కం ఛైర్మన్ సుమతిరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 50 మందికి చీరలు పంపినీ చేయడం జరిగింది. ఈసందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ భగవంతుని సన్నిధిలో పనిచేస్తున్నటువంటి వారికి చీరలు పంపినీ చేయడం ఎంతో గర్వకారణంగా ఉందని ఉదార భావంతో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దాన ధర్మాలు చేయడం పేద విద్యార్తులుకు పుస్తకాలు పంపినీ చేయడం, పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇవన్నీ చేయడం భగవంఉడు మాకు ఇచ్చినటువంటి అవకాశాన్ని ఎంతో ఆనందాయకంగా చేయగలుగుతున్నామని ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి భగవంతుడు మాకు అన్ని విధాల సహాయ సహకారాలు అంఅదించాలని కోరారు. ఈకార్యక్రమంలో తతిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# బీరం సుబ్బారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ



పోరుమామిళ్ళ రూరల్, జూలై 01ప్రభాతవార్త:

ఖాజీపేట కొత్త నెల్లూరు గ్రామం దగ్గర బేరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థలో శనివారం 6వ తరగతి చదువుతున్న విద్యార్థి సోహెల్ మృతికి కారణమైన బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థల ఛైర్మెన్ బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థల ఛైర్మెన్ బీరం సుబ్బారెడ్డిని, పాఠశాల ప్రిన్సిపల్‌ను వెంటనే అరెస్ట్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్ విద్యార్థి అనుమానస్పద మృతికి కారణమైన బీరం సుబ్బారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐల మండ ల నాయకులు బాబు, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

# 9న మల్లికార్జునీయం పుస్తకావిష్కరణ సభ

వైవీయూ, జులై 2 ప్రభాతవార్త :

లలిత కళానికేతన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 ఆదివారం ఉదయం 10గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అభినందన సంచిక 'మల్లికార్జునీయం' పుస్తకావిష్కరణ సభను నిర్వహిస్తున్నట్లు లలిత కళానికేతన్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కడప పార్లమెంట్ సభ్యులు వై.యస్.అవినాష్ రెడ్డి, సభాధ్యక్షులుగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, విశిష్ట అతిథులుగా మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, ఆత్మీయ అతిథులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, డా? వై.యస్.ఆర్.ఆర్కిటెక్చర్ మరియు ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ రెడ్డి, పుస్తక సమీక్షకులుగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డా? తవ్వా వెంకటయ్య పాల్గొంటారని, ఆ తర్వాత సంపాదకవర్గ మిత్రుల అభినందనలుంటాయని, తదనంతరం పుస్తక ముద్రణకు ఆర్థికంగా సహకరించినవారికి ఆత్మీయ సత్కారం ఉంటుందని, ఆకాశవాణి క్యాజువల్ అనౌన్సర్ భూమిరెడ్డి స్వరూపరాణి సభా నిర్వహణ, కవి, రచయిత మూల పెద్ద అయ్యవారు రెడ్డి వందన సమర్పణ చేస్తారని తెలిపారు.

# ప్రపంచం మెచ్చిన నాయకుడు మోదీ

– బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్



వేంపల్లె, జూలై 2, ప్రభాతవార్త :

దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 9ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేంపల్లె ప్రియాతోటలో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ సందర ్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనతో కరోనా కష్టకాలంలో ఉచిత కరోనా వ్యాక్సిన్ ఉచిత బియ్యం అందించడం జరిగిందన్నారు. 13ఏళ్లు ముఖ్యమంత్రిగా, 9ఏళ్లు ప్రధానిగా అలుపెరుగని దేశ సేవ చేస్తున్నారని అన్నారు. అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్‌తలాక్, 370 ఆర్టికల్ రద్దు లాంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. దేశంలో 4వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను వాటిస్థాయి పెంచి 9వ కిలోమీటర్ల నిర్మాణంతో పాటు 60దేశాలకు కరోనా వ్యాక్సిన్ పంపించడం లాంటి అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ముద్రాయోజన, బేటీబచావో బేటీపఢావో, సుకన్య సమృద్ధియోజన, కిసాన్ సమ్మాన్‌నిధి, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, జల్‌జీవన్ ఆయుష్మాన్ భారత్‌తోపాటు 306 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో అంతర్జాతీయంగా అగ్రస్థాయిలోకి తీసుకువెళ్తున్నందుకు నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు రామచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుష్మా, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అతికారి రమేష్, నామాచరణ్‌రాయల్, పసుపులేటి నాగేంద్ర, కస్తూరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పులివెందుల రోడ్లపై చెరువులు, బావుల నిర్మాణం

వేంపల్లె, జూలై 2, ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులని యోజకవర్గంలోని రోడ్లపై చెరువులు, బావుల నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వం చేపట్టిందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వేంపల్లె మండల కేంద్రంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లె నాలుగురోడ్ల కూడలి వద్ద గత ఆరు నెలలుగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, భారీ గుంతలు ఏర్పడి బావులు, చెరువులను తలపిస్తున్నాయన్నారు. వాహనాలు దెబ్బతింటున్నాయని, ప్రయాణికుల ఒళ్లు గుల్ల అవుతోందన్నారు. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించాలని తులసిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, నామా వినయ్, బద్రి, రాఘవయ్య, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీతో టమోటా కాయలు



రాయచోటి, జూలై 02ప్రభాతవార్త:

రాయచోటి పట్టణం రైతు బజారులో మార్కెట్ ఛైర్మెన్ వండాడి వెంకటేశ్వర్లు ఆదివారం సబ్సిడీతో టమోటా కాయలను పంపిణీ చేశారు. కిలో 50 రూపాయలు చొప్పున ఆధార్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి రైతు బజార్‌లో పంపిణీ చేశారు. బయట మార్కెట్: టమోటాలు కిలో 100 నుంచి 120 రూపాయలు ఉండడంతో వ్యవసాయం కమిటీ సిబ్బంది వ్యవసాయ సలహా మండలి సభ్యులు దిన్నెపాడు రవిరాజు కౌన్సిలర్ గౌస్‌ఖాన్‌తో కలిపి పంపిణీ చేశారు. టమోటా కాయల కోసం పట్టన ప్రజలు రైతు బజారుకి రావడంతో రైతు బజారు నందు ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. టమోటా ధరలు తగ్గినంతవరకు ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మార్కెట్ ఛైర్మెన్ వెంకటేశ్వర్లు తెలిపారు.

# ప్రతి సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తా

నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



పీలేరు, జూలై 02 ప్రభాతవార్తః

పట్టణంలో 6వ రోజు ఇంటింటికి నల్లారి కార్యక్రమం తెదేపా నాయకులు కార్యకర్తలు అభిమానులతో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కలికిరి పట్టణంలో ప్రతి గడపకు వెళ్లి తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటే ప్రతి సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తానని రైతులకు మహిళలకు యువతకు ప్రజలకు భరోసా నిచ్చారు ఆదివారం కలికిరి పట్టణంలోని మంగమ్మ కాలనీ, బీడీ కాలనీ పలు ప్రాంతాల్లో ఇంటింటికి నల్లారి కార్య క్రమంలో దూసుకుపోతున్న కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి పరులకు అవకాశం కల్పించి అందరం నష్టపోయామని ఒక్క ఛాన్సు అంటూ అధికారం చేపట్టి అందరి బతుకులు కేంద్రంలో తాకట్టు పెట్టి తమ సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెదేపా అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదవారిని ఆదుకుంటామన్నారు. 2024 ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు సంతృప్తి పడేలా ఉందని మహిళలు, యువత, తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారని సంక్షేమ పథకాలతో పాటు ఆదాయాన్ని సష్టించడంలో అపర చాణిక్యుడని కిశోర్‌కుమారెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచి నల్లారి లక్ష్మీకర రెడ్డి, మాజీ జడ్పీటీసీ నల్లారి చంద్రారెడ్డి, సర్పంచి ప్రతాప్‌రెడ్డి, గుట్టమీదపల్లె సునీల్‌కుమారెడ్డి, చంద్రశేఖర్, నాగభూషణంరెడ్డి, మహేంద్రరెడ్డి, నిజాముద్దీన్, మాలతి, భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మల్‌రెడ్డి, సూరి,మధుసూధన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మురళి, అగస్తీశ్వర, మున్వర్, సనావుల్లా, బాషా, తదితర తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా యల్లమ్మ తల్లికి బోనాలు



గాలివీడు, జూలై 02ప్రభాతవార్త:

మండలంలోని నూలువీడు పంచాయతీ నాగూరి వాండ్లపల్లెకు సమీపంలో వెలసిన శ్రీ రేణుక యల్లమ్మ తల్లికి ఆ గ్రామ ప్రజలు ఆదివారం ఘనంగా బోనాలను పట్టారు. ఖరీఫ్ సీజన్ మొదలై నెల పూర్తయినపన్పటికీ సక్రమంగా వర్షాలు రాకపోవడంతో నాగూరు వాండ్లపల్లె ప్రజలు అమ్మవారికి బోనాలను పట్టారు. మంగళవాయిద్యాలతో బాణాసంచా తేల్చుకుంటూ అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా ఉండాలని రైతాంగం సుబిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

# కారణం లేకుండా నిర్మిస్తున్న ఇల్లు కూల్చివేత



రైల్వేకోడూరు రూరల్, జులై 2 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లె గ్రామ పంచాయతి పరిధిలోని కూని సత్యం, జయలక్ష్మీలకు సంబంధించిన ఇంటి నిర్మాణాన్ని అదే గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య, విజయ్‌కుమార్‌లు కూల్చివేసినట్లు బాధితులు సత్యం, జయలక్ష్మీలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా తనకేమి సంబంధం లేకున్నా కావాలనే దురుద్దేశ్యంతో తన కుటుంబానికి ఏదోక హాని చేసి తన ఇంటి నిర్మాణాన్ని కూల్చాలని కూని వెంకటసుబ్బయ్య పథకం ప్రకారమే తనపై, తన భార్యపై దాడిచేసి హింసించారని బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో వెంకటసుబ్బయ్య అనేవ్యక్తి పలురకాల వివాదాలకు చెందిన వ్యక్తిగా గుర్తింపుబడ్డారని, జయలక్ష్మీ అనే మహిళ కువైట్ నుంచి వచ్చి తన ఇంటి నిర్మాణాన్ని కాపాడుకునే ప్రయత్నంలో పూర్తిస్థాయిలో తనను గల్ఫ్‌దేశాలకు వెళ్లకుండా కేసులు పెట్టాలనే దురుద్దేశ్యంతో ప్రయత్నాలు చేస్తున్నారని ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ దగ్గర విజ్ఞప్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. పూర్తిస్థాయిలో న్యాయ విచారణ చేసి తప్పక బాధితులకున్యాయం చేస్తామని మోహన్‌కుమార్ తెలిపారు.

# బద్వేలులో ఆర్‌డిఒ కార్యాలయ నిర్మాణానికి 6 కోట్లతో టెండర్లు

రాజంపేట అర్బన్, జులై 2 ప్రభాతవార్త

ఇటీవలే నూతనంగా ఏర్పాటైన బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 6 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌డిఒ కార్యాలయ నిర్మాణానికి పరిపాలనపరమైన ఉత్తర్వులు ఇటీవలే లభించాయి. తాజాగా 6 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆర్‌డిఒ కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు రోడ్లు భవనాలశాఖ టెండరు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు కడప ఆర్‌అండ్‌బి డివిజన్ అధికారులు ఆర్‌డిఒ కార్యాలయ నిర్మాణం పనులకు టెండర్లను కూడా ఆహ్వానించారు. ఈనెల 15 లోగా టెండరు ప్రక్రియ కూడా పూర్తి కానుంది.

# ఉచిత వైద్య శిబిరాలు పేదలకు మేలు



గాలివీడు, జూలై 02ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం వల్ల పేదలకు ఎంతో మేలు కలుగుతుందని వైస్ ఎంపిపి యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ వద్ద లైఫ్‌లైన్ హాస్పిటల్ కడప, గాలివీడు అమీన్ మెడికల్ స్టోర్స్, ల్యాబ్ ఆధ్వర్యంలో కడప నగరాని కి చెందిన లైఫ్‌లైన్ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చిన సందర్భంగా ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఎంపిపి యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా గాలివీడు తదితర ప్రాంతాల ప్రజలు వందలాది మంది వైద్య సేవలు పొందడం, పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మున్ముందు ఇటు వంటి శిబిరాలను ప్రతి గ్రామంలో నిర్వహించాలని ఆయన సూచించారు. ఎస్ఐ వెంకట శివకుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినం దనీయమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచితంగా నిర్వహించే వైద్య శిబిరాల ను సది వ్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో మండల వైసిపి యువనా యకులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి, మండల వైకాపా మైనార్టీ యువనాయకుడు నిజాముద్దీన్, స్థానిక వైసిపి నాయకులు గోపినారెడ్డి, సుబ్బారెడ్డి, లైఫ్‌లైన్ ఆసుపత్రి వైద్యులు, అమీన్

# ఉర్దూభాష అభివృద్దే లక్ష్యం కావాలి

రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్



గుర్రంకొండ, జులై 2, ప్రభాతవార్త

ఉర్దూ భాష అభివృద్ధి గ్రంధాలయ సిబ్బంది లక్ష్యం కావాలని రాష్ట్ర ఉర్దూ అకాడ మీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్ అన్నారు. ఆదివారం స్థానిక ఉర్దూ గ్రంధాలయంలో జిల్లా వక్ఫ్‌కమిటీ ఛైర్మన్ కరీము ల్లాసాహెబ్‌తో కలిసి గ్రంధాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ అకాడమీ 36 కంప్యూ టర్ శిక్షణ కేంద్రాలను మరో 36 గ్రంధాలయాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉర్దూ సాహిత్యం, భాషావృద్ధికి ఉర్దూ అకాడమీ సేవలందిస్తోందని, ఇటీవల రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఎంఒయు చేసుకొని వృత్తిలోనూ పుణ్యాలలో ఉర్దూ అకాడమీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు, శిక్షణ పూర్తి అయిన తరువాత కంప్యూటర్ శిక్షణ యువతకు వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి వారికి శిక్షణ పూర్తి అయిన వారందరికీ సర్టిఫికెట్‌లను మంజూరు చేస్తామని తెలిపారు. వైసిప ప్రభుత్వం ఉర్దూను రెండో అధికార భాషగా అమలు చేస్తోందని, సిఎం జగన్మోహ న్‌రెడ్డి ఉర్దూ భాషాభివృద్ధికి మైనారిటీల సామాజిక అభివృద్ధికి ఎంతో చేయూతని స్తున్నట్లు వివరించారు. విధ్యార్థులు ఉర్దూ అకాడమీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ సిబ్బంది కుసుమకుమారి, చంద్రశేకర్‌నాయుడు, షౌకత్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మడికే కువైట్ కన్వీనర్ మరో అవకాశం

– ఆనందంలో వైసీపీ శ్రేణులు

ఓబులవారిపల్లె, జులై 2, ప్రభాతవార్త:



పార్టీ విధేయతకు కట్టుబడి పార్టీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ నమ్మకానికి మారుపేరుగా వైసీపీతో ఎన్నో సంవత్సరాలుగా అనుబంధం జగనన్న మీద అబిమానం అన్ని విధాలలా పార్టీ కార్యక్రమాలకు విధేయుడుగా ఉంటూ నమ్మకానికి పట్టాభిషేకం చేసినట్లు మళ్లీ ముమ్మడి బాల్‌రెడ్డికి కువైట్ వైసీపీ శ్రేణులు అగ్ర నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పార్టీ కార్యకలాపాల్లోనూ గతంలో కువైట్‌లో కరోనా సంక్షోభం ఉన్నప్పుడు ఎన్నో సేవా కార్యక్రమాలు కరోనాతో మృతి చెందిన వారి మృదేహాలను ఇండియాకు తరలించడంలో అందరూ సహకారంతో తనదైన శైలిలో దగ్గరుండి బాధ్యతతాయుతంగా మానవత్వంతో ఇంటికి పంపించి ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టారని బాల్‌రెడ్డి కుడి భుజం లాంటి వ్యక్తి నాగిరెడ్డి చంద్రవేఖర్‌రెడ్డి శాంతబత్తిని ప్రసాద్లు అన్నారు. అన్ని విధాలా ఆంధ్రులకు అండగా ఉంటూ ఎన్ని కష్టాలు వచ్చినా కువైట్ ఎంబసీతో చర్చలు జరిపి అందరికీ న్యాయం జరిగేలా బాధితులు వెంట ఉంటూ వారి సమస్య పరిష్కరించే వరకు రాజీ లేకుండా పోరాటాలు చేసే వారన్నారు. తిరిగి రాజీ లేకుండా పోరాటాలు చేసే వారన్నారు. తిరిగి నమ్మకంతో వైసీపీ పార్టీ అధిష్టానం తిరిగి కువైట్ వైసీపీ కన్వీనర్‌గా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల బాధ్యతగా పార్టీ ఆదేశాలు కుట్టుబడి పార్టీ విజయానికి పార్టీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఈ పదవిని తిరిగి అప్పజెప్పిన వైసీపీ అగ్ర నాయకులకు సీఎం జగన్‌కు, ఎంపీ విజయసాయిరెడ్డి, సీఎం సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి పలువురు వైసీపీ మంత్రులకు కువైట్ వైసీపీ నాయకులు ఇలియాస్ రామిరెడ్డి తదితరులకు మేడపాటి వెంకటకు బి.హెచ్ ఇలియాస్ మరియు అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామని కువైట్ కన్వీనర్ ముమ్మడి బాల్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ముందు ముందు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వైసీపీ పార్టీకి విజయానికి కువైట్ ఆంధ్రుల తరపున విజయానికి కువైట్ ఆంధ్రుల తరుపున పోరాటాలు చేసి జగనన్నకు తోడుగా ఉంటామన్నారు.

# ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా డా॥ మీనాక్షి రెడ్డి

వైద్యుల సేవలు అభినందనీయం – ఎమ్మెల్యే డా॥ సుధ



బద్వేలు అర్బన్, జూలై 02 ప్రభాతవార్త :

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా డా॥ మీనాక్షి రెడ్డిని స్థానిక వైద్యులందరూ ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. బద్వేలు శాసన సభ్యులు డా॥ సుధ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో డాక్టర్లందరూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా॥ బి.సి.రాయ్ జయంతిని పురస్కరించుకొని జాతీయ మెడికల్ అసోసియేషన్ ఏర్పడిందన్నారు. ఇదే రోజున బద్వేలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతృప్తి ఇస్తోందని, వైద్యుల సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే డా॥ సుధ అన్నారు. సమాజంలో డాక్టరు వృత్తి ఎంతో పవిత్రమైనదని, దైవంతో సమానంగా డాక్టర్లను ప్రజలు గౌరవిస్తారని, డాక్టర్లందరూ కూడా అంకితభావంతో పనిచేసి సమాజానికి ఎంతో మేలు జరిగే విధంగా ఉండాలన్నారు. వృత్తిలో భాగంగా వైద్య వృత్తిలో అన్ని విభాగాలను కలుపుతూ ఒక సొంత భవనాన్ని కార్యాలయం కొరకు సమకూర్చేందుకు కృషి చేస్తామన్నారు. డాక్టర్ల సమస్యలను అసోసియేషన్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డా॥ మీనాక్షి రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను గుర్తించడంతో పాటు సమాజానికి అవసరమైన సేవలను వైద్య పరంగా అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగానే వివిధ రకాల వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి నియోజకవర్గ వ్యాప్తంగా పేద ప్రజలకు ఉచిత వైద్యం అందజేసేందుకు తమ అసోసియేషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రధాన కార్యదర్శిగా డా॥ వాసుదేవ రెడ్డి, ట్రెజరర్‌గా డా॥ వెంకట దినేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐఎంఏ సభ్యులుగా డా॥ గోపాల కృష్ణయ్య, డా॥ హరి కిరణ్, డా॥ విష్ణువర్ధన్ రెడ్డి, డా॥ కిరణ్ కుమార్, డా॥ హరి కృష్ణ, డా॥ చంద్రహాస రెడ్డి, డా॥ సంపత్ కుమార్, డా॥ హుస్సేన్, డా॥ కోటా సుమన్, డా॥ సరస్వతి, డా॥ రామలక్ష్మీ, డా॥ పవిత్ర, డా॥ దివ్యతేజా, డా॥ రాంప్రతాప్ రెడ్డి, డా॥ రాంప్రసాద్, డా॥ జీవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికైన డా॥ మీనాక్షి రెడ్డిని పలువురు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# అధికారులతో సహ ప్రతిఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ పాటించాలి

– కలెక్టర్ గిరీష పిఎస్

రాయచోటి, జులై 2, ప్రభాతవార్త:

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 3న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి "జగనన్నకు చెబుదాం - స్పందన" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా.. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. అలాగే స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్‌ఎల్‌ఏ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటయ్య యాదవ్



బద్వేలు, జూలై 02 ప్రభాతవార్త :

చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం స్టేట్ కన్వీనర్ డా॥ గుండు సీతారం ఆదేశాల మేరకు చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బద్వేలు పట్టణానికి చెందిన గంటా వెంకటయ్య యాదవ్‌ను నియమిస్తూ కడప జిల్లా సిఆర్‌పిఎఫ్ కన్వీనర్ పి.ఓబన్న చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంటా వెంకటయ్య యాదవ్ మాట్లాడుతూ తనను ప్రోత్సహిస్తూ తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు డా॥ గుండు సీతారాం కు, అలాగే ఎంవి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట రెడ్డికి, ఎన్‌సిపిసిఆర్ మాజీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ శాంతా సిన్హా మరియు జిల్లా కన్వీనర్ పి.ఓబన్నలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, అలాగే నేను నియమించబడినప్పటి నుండి బాలలకు ఫోరం తరుపున సేవ చేస్తానని బాలల పక్షాన నిలబడతానని, బాలల సమస్యల పట్ల అన్ని వేళలా ముందుంటానని తెలియజేస్తూ నా బాధ్యత పూర్తిగా కృషి చేస్తానని తెలిపారు.

# భద్రకాళీ మాతకు విశేష పూజలు



బద్వేలు అర్బన్, జూలై 02 ప్రభాతవార్త :

భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని వీరభద్రస్వామి దేవస్థానం ఆర్యవైశ్య మహిళా కమిటీ అధ్యక్షురాలు దేవతి లక్ష్మీదేవి, సెక్రటరి తిరువీధి స్వప్న, స్పీకర్ దేవతి లలిత, జాయింట్ సెక్రటరి వడ్లపూటి విజయ, వైస్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి నాగమణితో పాటు పలువురు ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో భద్రకాళీ మాతకు ఒడి బియ్యం కార్యక్రమాన్ని శాస్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆషాఢ మాసంలో ప్రీతికరమైన మెహందీ కార్యక్రమాన్ని పలువురు మహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పలువురు మహిళలు రెండు చేతులకు గోరింటాకు పెట్టుకొని పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మహిళలకు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.రాధ, ఎస్.భారతి, సూరే రేష్మ, ఎన్.కుమారి, యల్లనూరు పద్మావతి, కామాక్షి, జూటూరు పద్మావతి, యం.శ్రీదేవి, ఉరిమి పద్మావతి, సి.లక్ష్మీదేవి, యం.కళ్యాణి, దేవతి స్వప్నతో పాటు పలువురు ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

# పోలి కొండల అక్రమాలు జరిగిన ప్రభుత్వ స్థలంలో ఎంఐజి లేఅవుట్

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఉత్తర్వులు జారీ



రాజంపేట అర్బన్, జులై 2 ప్రభాతవార్త

జిల్లాలో సంచలనం సృష్టించిన పోలి కొండల అక్రమాల్లో నిగ్గుతేలిన ప్రభుత్వ భూమిలో రాష్ట్ర ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు అందజేసేందుకు నిర్ధేశించిన ఎంఐజి లేఅవుట్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించినట్లు తెలిసింది. సుమారు 20 ఎకరాలు స్థలం పోలిచెరువు సమీపంలోనే పూర్తిస్థాయిలో చదును చేసి లేఅవుట్ వెంటనే ఏర్పాటు చేసేలా ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశాల మేరకు జెసి ప్రతిపాదనలు పంపాలని రాజంపేట తహశీల్దారును ఆదేశించినట్లు తెలుస్తోంది. వివాదాస్పదమైన పోలి కొండల అక్రమాల్లో నందలూరు మండలం చుక్కాయపల్లె, చాపలవారిపల్లె, ముంపు నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అనధికారికంగా లేవుట్‌ను సిద్ధం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ పనులు చేయడంపై ఇప్పటికే ఓ విఆర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు ఇద్దరు అధికారులను సంజాయిషి కూడా అడిగారు. అంతకుముందే పోలికొండల అక్రమాలపై కలెక్టర్ ఆదేశాలతో సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ స్వయంగా పోలిచెరువు పరిసర ప్రాంతాలను సర్వే చేసి కలెక్టర్‌కు నివేదిక పంపారు. కలెక్టర్ వద్ద ఇప్పటికే ఈ సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో సర్వేనంబరు 1774, 1802తో పాటు 1739 నంబర్లలో సుమారు 10 ఎకరాలు పైబడి భూమి ఉంది. అలాగే 831 సర్వేనంబరులో కూడా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో ఎంఐజి లేఅవుట్‌కు ఏయే భూములను పంపనున్నారో ఇంకా స్పష్టత రాలేదు. పూర్తి సమాచారంతో ప్రతిపాదనలు పంపాలని జెసి ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే కడప – చెన్నై జాతీయ రహదారిలో ఒక ఎంఐజి లేఅవుట్ ఏర్పాటుకు అధికారికంగా టెండర్లు పిలిచారు. తాజాగా పోలితో పాటు నూతన జాతీయ రహదారి సమీపంలో కూడా మరొక ఎంఐజి లేఅవుట్‌ను 50 ఎకరాల్లో సిద్ధం చేయాలని ప్రతిపాదనలు స్థానిక రెవెన్యూ అధికారులు ఇప్పటికే కలెక్టర్‌కు పంపేందుకు రికార్డులు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తాజాగా పోలి కొండల అక్రమాల స్థలం ఎంఐజి లేఅవుట్‌కు ప్రతిపాదనలు పంపడంపై సర్వత్ర చర్చణీయాంశంగా మారింది.

# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

– విద్యార్థుల భవిష్యత్తును కాపాడండి

ఓబులవారిపల్లె, జులై 2, ప్రభాతవార్త:



బడిఈడు పిల్లలను బడిలో చేర్పించి విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని విద్యావేత్తలు ప్రజా సంఘాల నాయకులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల నెలకొల్పి విద్యాభ్యాసం పేరుతో ఖర్చు చేస్తూ ఉంటే అవగాహన లేక తల్లిదండ్రులకు విద్య పట్ల మక్కు లేక అమాయకత్వంతో వారిని బడికి పంపించలేకపోవడంతో బడిఈడు పిల్లలు బడి బయట మేకలు, పశువులు కాస్తూ, బాల కార్మికులుగా జీవనం దుర్భరంగాను గడుపుతున్నారంటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి వి.పురం, కొత్తపల్లి గాజుల పెద్దఒరంపాడు, వెంకటేశ్వర కాలనీ, చిన్న ఒరంపాడు, చిన్నంపల్లి, ఎన్‌టీ కాలనీ తదితర పంచాయతీలో మనకు తెలియకుండానే బడిఈడు పిల్లలు బడి బయట ఉండడంతో విద్యాభ్యాసానికి నోచుకోక నిరక్షరాస్యులుగాని సంవత్సరాల కొద్ది ఉన్నారని అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని పలువురు అదికారులను కోరుతున్నారు.

# జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల ఉచిత సేవలు

– విశ్వ బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ గొడ్లవీటి సుబ్రమణ్యం

బ్రహ్మంగారి మఠం, జూలై 02 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద ప్రజలకు న్యాయం జరిగే విధంగా జగనన్న సురక్ష పథకం ద్వారా సచివాలయాలలో 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నారని విశ్వ బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ గొడ్లవీటి సుబ్రమణ్యం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు చేర్చే విధంగా సచివాలయాలను, వాలంటీరు వ్యవస్థను ఏర్పాటుచేసి ఇంటింటికీ వాలంటీర్లు వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకొని త్వరితగతిన వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలు, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, మ్యుటేషన్ వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందించే విధంగా జగనన్న సురక్ష పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పేద ప్రజలకు ఎలాంటి రుసుము లేకుండా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఉచితంగా అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం పలు రకాల ధృవపత్రాలను పలువురికి అందజేయడం జరిగిందన్నారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్ళి లబ్ధిదారులు ఏ పథకానికి అర్హులో గుర్తించి వారి పేర్లు నమోదు చేసుకొని పథకాలు వారికి అందే విధంగా వాలంటీర్లు కృషి చేయాలని, వాలంటీర్లే లబ్ధిదారులకు మూలస్తంభాలు లాంటి వారని ఆయన అన్నారు.